

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



అక్టోబర్ 13 మంగళవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 250 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

TUESDAY OCTOBER 13 2026 | VOL:18 | ISSUE: 250 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన.. చార్జీల తగ్గింపుకు కసరత్తు

ఆర్టీసీ-మెట్రో పాస్ చార్జీలపై సమీక్ష

త్వరలో కొత్త ధరలు ప్రకటిస్తామన్న మంత్రి పొన్నం

ధరలు భారంగా ఉన్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు

హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ చార్జీలపై తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్‌కు రూ. 400 (మెట్రోకు రూ. 300, ఆర్టీసీకి రూ. 100), నెలవారీ పాస్‌కు రూ. 8,500 (మెట్రోకు రూ. 7,000, ఆర్టీసీకి రూ. 1,500) చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ ధరల నిర్ణయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన సూచన మేరకు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని చార్జీలను పునఃపరిశీలించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడమేనని, ప్రజలపై అదనపు భారం మోపడం తమ లక్ష్యం కాదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రయాణికుల అవసరాలు, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశమై అందరికీ అందుబాటులో ఉండేలా ధరలపై సరైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ పథకం ద్వారా ప్రయాణికులకు మేలు చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.



ఎన్నికల్లో ఓటమి భయంతోనే మోదీ సర్కార్ 'సర్' ను అమలు చేస్తోంది.. సీఎం ధ్వజం

ఢిల్లీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కారుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (ఎశ్రీఅస్త్రుఱు జవీ =వఱుత్ష్ట్ర =వసఎఎ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, బిహార్, మహారాష్ట్రలో సర్ (ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ) ఎక్కడ తీసేశారో అక్కడ బీజేపీ గెలుస్తోందని ధ్వజమెత్తారు. మతాలు, ప్రాంతాల మధ్య బీజేపీ చిచ్చు పెడుతోందని దుయ్యబట్టారు. మనుగడ లేని రాష్ట్రాల్లో ఇతర పార్టీలు గెలుస్తున్నాయని వెల్లడించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. సీఈసీ ఎంపికలో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిని తొలగించారని ప్రస్తావించారు. ఈరోజు (సోమవారం) ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు.

2014లో 81 కోట్ల ఓట్లు వచ్చాయని.. 2019లో 91 కోట్ల ఓట్లు, 2023లో 97 కోట్ల ఓట్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ఇప్పటికే 13 కోట్ల ఓట్లు తొలగించారని, ఇప్పుడు ఉన్న జనాభా ఎంత అని ప్రశ్నించారు. జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతున్నాయి..? అని నిలదీశారు. ఈ విషయంలో ఎవరు సమాధానం చెబుతారని అడిగారు. రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు కూడా మోదీకి ఈ విషయం గురించి ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీ రెండు వర్గాలను తయారు చేస్తోందని.. అనుకూలం ఉన్న వారికి ఓట్లు, ఇతరులను ఓట్లులేని వారిగా తయారు చేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలోని పౌరులను మోదీ సర్కార్ రెండు రకాలుగా విడగొడుతోందని మండిపడ్డారు. ఓటు హక్కు కోల్పోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.



దేశంలో శాశ్వత విభజనను బీజేపీ తీసుకొస్తోంది..

దేశంలో శాశ్వత విభజనను బీజేపీ తీసుకొస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. సీఈసీపై మరో స్వతంత్ర పోరాటం జరుగుతోందని

(మిగతా 2వ పేజీలో..)

రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్.. టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!

రేడియల్ రోడ్ టెండర్లలో అవకతవకలంటూ రాజగోపాల్ రెడ్డి ఆరోపణ

రూ.600 కోట్లు తక్కువకు బిడ్ వేసినా తమను తప్పించారని మండిపాటు

సీఎం రేవంత్ శాఖలోనే దోపిడీ జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే



'ఇప్పుడు దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది'.. నిరసన వేదిక గుర్తింపు రద్దుపై అభిజీత్ దిప్కే

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌కు ఆ హోదాను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే స్పందించారు. ఇప్పుడు దేశమంతా 'జంతర్ మంతర్' అవుతుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'వారు (కేంద్రం) జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన స్థలం జాబితా నుంచి తొలగించారు. అవును, అది ఇకపై నిరసన స్థలం కాదు. ఏదేమైనా ఒక పిరికి నియంత దానిని యుద్ధ క్షేత్రంగా మార్చేశారు. ఇక దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది' అని అందులో పేర్కొన్నారు. అలాగే, ఈ రోజు జంతర్ మంతర్‌కు ఉన్న 'నిరసన ప్రదేశం' హోదాను ప్రధాని మోదీ రద్దు చేశారని, రేపు ఆయన ప్రజాస్వామ్యాన్నే రద్దు చేస్తారని మరో పోస్ట్‌లో మండిపడ్డారు. 'ఆ నియంతకు అసలు సమస్య నిరసన ప్రదేశం కాదు. ప్రజలు నిరసన తెలపడం అనే భావనే ఆయనకు సమస్య' అని విమర్శించారు. కాగా, జంతర్ మంతర్‌ను నిరసనలకు నిర్దేశిత ప్రదేశంగా గుర్తించే



(మిగతా 2వ పేజీలో..)

200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు.. రాహుల్ సంచలన వ్యాఖ్యలు

జ్ఞానేశ్ కుమార్ తనకు సందేశాలు పంపుతున్నారని రాహుల్ వెల్లడి

అప్రూవర్‌గా మారాలని జ్ఞానేశ్‌కు రాహుల్ సూచన

మోదీ, అమిత్ షా, దోవల్, అదానీ కలిసి ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణలు

జ్ఞానేశ్ అసలు నేరస్థుడు కాదని.. సూత్రధారులు వేరే ఉన్నారని వ్యాఖ్య

సీఈసీని తొలగించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టీకరణ

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తనకు సందేశాలు పంపిస్తున్నారని వెల్లడించారు. "మీరు చేసిన తప్పును అంగీకరించి అప్రూవర్‌గా మారండి. మీరు



(మిగతా 2వ పేజీలో..)

సింగూరు ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటి: హరీశ్ రావు

హైదరాబాద్, అక్టోబర్ 12:

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు(సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడానికి కాంగ్రెస్‌కు మనసు లేదని మండిపడ్డారు. పంటలు వేయొద్దంటే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతు కూలీలు ఎలా బతకాలి.. వలసలు పోవాలా అని నిలదీశారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు వలసలు వాపస్ వచ్చాయని.. ఇప్పుడు మళ్లీ వలసలు మొదలయ్యాయని విమర్శించారు.రైతులు డీజిల్ ఇంజిన్‌లు పెట్టుకుని పంటలను కాపాడుకుంటున్నారని.. ప్రతి దానికీ ఎల్‌నినోతో లింక్ పెడుతున్నారని

(మిగతా 2వ పేజీలో..)



ఇది ఓట్ల దొంగతనమే: మంత్రి శ్రీధర్ బాబు

ఓటర్ల జాబితా సవరణపై ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన

ఆందోళనలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, నేతలు

సీఈసీని తొలగించాలని డిమాండ్

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (ఖ×=) ప్రక్రియకు వ్యతిరేకంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో భారీ నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని ఆరోపిస్తూ, సుప్రీంకోర్టు వరకు మార్చ్ చేస్తామని ఈ సందర్భంగా నేతలు హెచ్చరించారు.ఏఐసీసీ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ ను అడ్డుపెట్టుకుని, తమకు వ్యతిరేకంగా ఉన్న అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తోందని, ఇది ఓట్ల దొంగతనమేనని తీవ్రంగా విమర్శించారు. ప్రధాన ఎన్నికల



(మిగతా 2వ పేజీలో..)

పొన్నం ప్రభాకర్ సవాల్ కు రాంచందర్ రావు స్పందన

ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

ఓట్లు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా మీ ముందుకే తెస్తానన్న పొన్నం

ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని రాంచందర్ రావు డిమాండ్

తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితా

(మిగతా 2వ పేజీలో..)



విజయకేరళం
తెలుగు దినపత్రిక

సం పా దకీయం

2027లో సూపర్ ఎల్‌నినో ముప్పు..

ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలి!

వాతావరణ మార్పులతో వ్యవసాయం, తాగునీటిపై ప్రభావం పడే అవకాశం.. నీటి సంరక్షణ, ఆహార భద్రతపై దృష్టి పెట్టాల్సిన సమయం

ఎల్‌నినో.. ఒకప్పుడు చాలామందికి తెలియని పదం. కానీ వాతావరణ మార్పులు, వర్షపాతంపై దాని ప్రభావం గురించి ఇప్పుడు విస్తృతంగా చర్చ జరుగుతోంది. రాబోయే రోజుల్లో ఎల్‌నినో పరిస్థితులు మరింత బలపడితే వ్యవసాయం, తాగునీటి లభ్యత, ఆహార ఉత్పత్తులపై ప్రభావం పడే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా 2027లో ఎల్‌నినో ప్రభావం ఎలా ఉండబోతోందన్న అంశంపై ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.సాధారణంగా ఎల్‌నినో ప్రభావం వల్ల కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం, కరువు పరిస్థితులు ఏర్పడటం వంటి పరిణామాలు చోటుచేసుకోవచ్చు. అయితే దీని ప్రభావం అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా ఉండదు. రుతుపవనాల రాక, వర్షాల పంపిణీ, స్థానిక వాతావరణ పరిస్థితుల ఆధారంగా మార్పులు ఉంటాయి. అందువల్ల 2027లో పరిస్థితులు ఎలా ఉండబోతున్నాయో తెలుసుకోవడానికి అధికారిక వాతావరణ అంచనాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలి.

పంటలపై ప్రభావం పడితే రైతులకు ఇబ్బందులే!

వర్షపాతం తగ్గితే వ్యవసాయ రంగం తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. సాగునీటి కొరతతో పంటల దిగుబడులు తగ్గవచ్చు. భూగర్భ జలాల మట్టాలు పడిపోతే తాగునీటి సరఫరాపైనా ఒత్తిడి పెరిగే అవకాశం ఉంటుంది. పంటల ఉత్పత్తి తగ్గితే బియ్యం సహా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే పరిస్థితులు ఏర్పడవచ్చు. అయితే ధరల పెరుగుదల వాతావరణ పరిస్థితులతో పాటు ఉత్పత్తి, నిల్వలు, మార్కెట్ డిమాండ్‌పై కూడా ఆధారపడి ఉంటుంది.

ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు అవసరం

ప్రకృతి పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడే నీటిని పొదుపుగా వినియోగించుకోవడం అత్యంత ముఖ్యం. రైతులు వాతావరణ అంచనాలు, వ్యవసాయ శాఖ సూచనల ఆధారంగా పంటల ఎంపిక చేసుకోవాలి. తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి పెట్టాలి. చెరువులు, కుంటల్లో నీటి నిల్వలను పెంచడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాలను సంరక్షించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి.ప్రజలు కూడా అవసరానికి మించి ఆహార ధాన్యాలను కొనుగోలు చేసి నిల్వ చేయడం కంటే, కుటుంబ అవసరాలకు సరిపడా నిల్వలు ఉంచుకుంటూ నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలి. ప్రభుత్వం వ్యవసాయం, తాగునీరు, విద్యుత్తు రంగాల్లో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

అప్రమత్తతే అసలైన రక్షణ

ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందనే విషయంలో స్పష్టత రావాలంటే శాస్త్రీయ అంచనాలు కీలకం. సూపర్ ఎల్‌నినో ఏర్పడుతుందనే వార్తలను నిర్ధారిత వాస్తవాలుగా భావించకుండా, భారత వాతావరణ శాఖ విడుదల చేసే అధికారిక సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.వాతావరణ పరిస్థితులు ఎలా మారినా నష్టాన్ని తగ్గించుకునేందుకు ముందస్తు ప్రణాళికలు అవసరం. నీటి సంరక్షణ, ఆహార భద్రత, వ్యవసాయ రక్షణపై ఇప్పటి నుంచే దృష్టి సారిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను కొంతవరకు అధిగమించవచ్చు. రేపటి సంక్షోభాన్ని ఎదురుచూడటం కాదు.. నేటి నుంచే సిద్ధం కావడం మనందరి బాధ్యత.

ఎన్నికల్లో ఓటమి భయంతోనే మోదీ సర్కార్ 'సర్' ను అమలు చేస్తోంది.. సీఎం ధ్వజం

మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. జ్ఞానేశ్ గో బ్యాక్ పేరుతో తమ ఆందోళన కొనసాగుతోందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సర్ వ్యతిరేక పోరాటం, మరో స్వతంత్ర పోరాటమేనని.. సైమన్ గో బ్యాక్ పోరాటం లాగే తాము పోరాటం చేస్తామని అన్నారు. ఇన్నాళ్లు సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను ఉపయోగించి ప్రత్యర్థులను అణిచివేశారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలవదనే అభిప్రాయంతో 'సర్'ను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమకు ఓటు వేయని వారి ఓట్లను 'సర్' పేరుతో తొలగిస్తున్నారని ఆగ్రహించారు.

ఏఐను ఉపయోగించి బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారు..

ఏఐను ఉపయోగించి బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మోదీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న యువత ఓట్లను కూడా తొలగిస్తున్నారని ఫైర్ అయ్యారు. మోదీ ఎందుకు జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఓట్లను తొలగించి పశ్చిమబెంగాల్, బిహార్, హరియానాలో గెలిచారని ధ్వజమెత్తారు. ఓటు లేకపోతే ఏ పార్టీ పేదలను పట్టించుకోదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు.. రాహుల్ సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి)

ప్రధాన నేరస్థుడు కాదు. మీ వెనుక అసలు సూత్రధారులు ఉన్నారు" అని జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష కూటమి చేపట్టిన మార్చ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

సీఈసీ సందేశాలు పంపిస్తున్నారు

జ్ఞానేశ్ కుమార్ తనను సంప్రదించారా? సందేశాలు పంపారా? అని ఓ విలేకరి అడగ్గా.. రాహుల్ అవునని సమాధానమిచ్చారు. తాను నిర్వహిస్తున్న మీడియా సమావేశాన్ని కూడా ఆయన చూస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే, తనకు వచ్చిన సందేశాల్లోని వివరాలను మాత్రం వెల్లడించలేదు.

మోదీ, అమిత్ షా ఒత్తిడి ఉందని ఆరోపణ

జ్ఞానేశ్ కుమార్‌పై ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఒత్తిడితోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఆధారాలను మీడియా ముందు వెల్లడించలేదు.

సుప్రీంకోర్టుకు ప్రతిపక్ష కూటమి

ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రాహుల్ గతంలోనూ ఆరోపణలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత దెబ్బతింటోందని విమర్శించారు. సీఈసీని తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

200 మంది అధికారులు టచ్‌లో

కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 200 మంది అధికారులు ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని రాహుల్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), విదేశాంగ శాఖకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. వారే తమకు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ వాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.

రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి రావాలి

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఎన్నికల నిష్పాక్షికతపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని రాహుల్ చెప్పారు. పిటిషన్ దాఖలు చేయాలని సీజేఐ సూచించినట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తామని స్పష్టం చేశారు.జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన ఆగదని రాహుల్ ప్రకటించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ, అమిత్ షాపై కూడా తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

'ఇప్పుడు దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది'.. నిరసన వేదిక గుర్తింపు రద్దుపై అభిజీత్ దిప్కే

మొదటి పేజీ తరువాయి)

హోదాను రద్దు చేస్తూ ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'కమిటీ సిఫార్సుల ఆధారంగా, నిరసన వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేశారు. నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించడానికి రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, సీబీడీ మైదానం అనే మూడు కొత్త ప్రదేశాలను నిర్దేశించారు' అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మూడు కొత్త ప్రదేశాలలో నిరసనలు నిర్వహించడానికి సంబంధించిన ప్రామాణిక కార్యనిర్వహణ విధానాలను వేర్వేరుగా జారీ చేస్తామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. మరోవైపు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (సర్) వివాదంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ప్రతిపక్షాలతో పాటు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనలను ఉధృతం చేశాయి. దీంతో గత రెండు రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అక్కడకు చేరుకుంటున్న నిరసకారులను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇప్పటి వరకు నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌కు ఆ గుర్తింపును రద్దు చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నది.

రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్.. టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!

మొదటి పేజీ తరువాయి)

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు. మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో నే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

సింగూరు ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటి: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి మండిపడ్డారు. బొగ్గు లేదంటే కూడా ఎల్‌నినో అంటున్నారన్నారు. సర్కార్ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందని విరుచుకుపడ్డారు. దేవాదులలో మోటార్లు ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. సింగూరు ప్రాజెక్ట్‌లో వాడుకునేందుకు రెండు టీఎంసీల నీరు మాత్రమే ఉందని తెలిపారు. ఆ నీళ్లను కూడా బీర్ల కంపెనీలకు ఇస్తున్నారని ఆరోపించారు. దసరా లిక్కర్‌కు షార్టేజ్ రావొద్దని వాళ్లకు నీళ్లు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యమని ప్రశ్నించారు. సింగూరుపై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటని ప్రశ్నించారు. పంటల కోసం జూరాల గేట్లు తెరిస్తే రైతులను జైలుకు పంపారని.. తాగునీరు ఇవ్వకుండా బీర్ల కంపెనీలకు నీళ్లు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కేసులు పెట్టాలని హరీశ్ డిమాండ్ చేశారు. నీళ్లుండి కూడా ఎత్తని ప్రభుత్వం ఇది అంటూ మండిపడ్డారు. రైతులతో గంట సేపు మాట్లాడే సమయం ముఖ్యమంత్రికి లేదా అంటూ ప్రశ్నించారు. బీర్ల కంపెనీలకు నీళ్లు, ఢిల్లీలో రాజకీయాలు తప్ప ఈ ప్రభుత్వానికి ఇంకో పని లేదని హరీశ్ రావు విమర్శించారు.

పొన్నం ప్రభాకర్ సవాల్ కు రాంచందర్ రావు స్పందన

మొదటి పేజీ తరువాయి)

సవరణలో పేర్ల తొలగింపు అంశంపై ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ సవాల్ విసిరారు.ఓటర్ల జాబితాల సవరణపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఓట్ల తొలగింపుపై రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "రాంచందర్ రావు తేదీ, సమయం ప్రకటిస్తే.. ఓటు హక్కు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా ఆయన ముందుకే తీసుకొస్తాను" అని పొన్నం స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ ప్రక్రియలో పొరపాట్లు జరిగితే సరిదిద్దాల్సింది పోయి, బీజేపీ నేతలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.మంత్రి పొన్నం సవాల్‌పై స్పందించిన రాంచందర్ రావు... ఓట్లు తొలగించబడినట్లు చెబుతున్న ఒక 10 మందిని ఎన్నికల సంఘం కార్యాలయానికి తీసుకురావాలని ప్రతి సవాల్ విసిరారు. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలగగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఫసల్ బీమా యోజనలో చేరాలని ఈ ఏడాది మార్చిలోనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మొత్తంమీద, ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

ఇది ఓట్ల దొంగతనమే: మంత్రి శ్రీధర్ బాబు

మొదటి పేజీ తరువాయి)

కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఈసీని పదవి నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. హిందుస్థాన్ టైమ్స్, పీటీఐ కథనాల ప్రకారం, సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారని రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ఓట్లు తొలగించడం దారుణమని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 'ఓట్ బచావో, దేశ్ బచావో' నినాదంతో ఈ దేశవ్యాప్త ఆందోళనను కాంగ్రెస్ ఉద్ధృతం చేసింది.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక
అక్టోబర్ | మంగళవారం | 13 | 2026

ఎల్‌నినో ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి.. తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలి: భట్టి విక్రమార్క





నల్గొండ, అక్టోబర్ 12 (విజయ కెరటం):

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, తాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేందుకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఢిల్లీ నుంచి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రైతులతో మాట్లాడారు. వాతావరణ అంచనాల ప్రకారం ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయని, అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం కారణంగా వ్యవసాయం, తాగునీటి సరఫరాపై ప్రభావం పడవచ్చని తెలిపారు.గత నాలుగు నెలలుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, జిల్లా యంత్రాంగం ద్వారా రైతులను అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడుకోవాలని, నీరు అందుబాటులో లేని ప్రాంతాల్లో కొత్తగా పంటలు సాగు చేసి నష్టపోవద్దని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, శాస్త్రవేత్తల సలహాల మేరకు తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను ఎంచుకోవాలని, కొత్తగా నాటిన ఉద్యాన పంటలను సంరక్షించాలని కోరారు. ఎల్‌నినోపై వచ్చే వదంతులను నమ్మవద్దని సూచించారు.రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, చెరువుల్లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించాలని స్పష్టం చేశారు. అవసరమైతే దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని నిల్వ చేసుకోవాలని, ప్రజలు, పశువులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అందరూ సహకరించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా రైతులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.

సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి: మంత్రి తుమ్మల

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత కఠినంగా మారే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో సుమారు 15 లక్షల ఎకరాల వరి సాగు విస్తీర్ణం తగ్గినట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ పంటలు పండించేలా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.రైతులు నూనెగింజలు, పప్పుధాన్యాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇప్పటికే సాగులో ఉన్న పంటలను కాపాడుకోవాలని సూచించారు. రబీ సీజన్‌లో తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను మాత్రమే ఎంచుకోవాలని తెలిపారు. రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లోని నీటిని సాగుకు వినియోగించే అవకాశం లేదని, విద్యుత్ ఉత్పత్తి పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించాలని అధికారులను ఆదేశించారు.విద్యుత్ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయిలో కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని, సౌర విద్యుత్ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరాపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని అధికారులకు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు చేపడుతున్న చర్యలను వివరించారు. వాతావరణ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు తమ కార్యాచరణను వెల్లడించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కనగల్ మండలం పగిడిమర్రి రైతు వేదిక నుంచి హాజరయ్యారు. జిల్లా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పాదయాత్ర

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్

వరంగల్ విజయ కెరటం, 12,అక్టోబర్:

ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడుతూ, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్ర, నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, జాటోతు రామచంద్ర నాయక్, కె.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమ్మిండ్ల శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ సైతం ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు కీలక పాత్ర పోషిస్తాయని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించడంతో పాటు ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్



చేశారు.ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ లక్ష్యంగా పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు నాయకులు తెలిపారు.

నల్గొండ రెడ్‌క్రాస్‌కు తొలి మహిళా చైర్‌పర్సన్‌గా డాక్టర్ హేమలత

హేమలత ప్యానెల్‌కు 8 స్థానాలు.. అమరేందర్ రెడ్డి ప్యానెల్‌కు 7 స్థానాలు
కీలక పదవులకు ఏకగ్రీవ ఎంపిక.. నూతన కార్యవర్గంపై సేవాభిమానుల ఆశలు

నల్గొండ, అక్టోబర్ 12 (విజయ కెరటం):

నల్గొండ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సుమారు 12 ఏళ్లుగా ఎన్నికలు లేకుండా కొనసాగుతున్న నిర్వహణ వ్యవస్థలో ఈసారి ఎన్నికల ద్వారా మార్పు చోటుచేసుకుంది. అక్టోబర్ 11న నిర్వహణ కమిటీ సభ్యుల ఎన్నికలు జరగగా, సోమవారం కీలక పదవుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. సొసైటీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ హేమలత ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. దీంతో నల్గొండ రెడ్‌క్రాస్ సొసైటీకి తొలి మహిళా చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు.

రెండు ప్యానళ్ల మధ్య పోటీ

రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహణ కమిటీ ఎన్నికల్లో డాక్టర్ హేమలత నేతృత్వంలోని నల్గొండ సేవా సమితి ప్యానెల్, గోలి అమరేందర్ రెడ్డి ప్యానెల్ పోటీ పడ్డాయి. మొత్తం 1,385 మంది ఓటర్లు ఉండగా, 32 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అక్టోబర్ 11న జరిగిన పోలింగ్‌లో 1,003 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం జరిగిన ఓట్ల లెక్కింపులో 15 మంది నిర్వహణ కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.ఫలితాల్లో డాక్టర్ హేమలత నేతృత్వంలోని నల్గొండ సేవా సమితి ప్యానెల్‌కు 8 స్థానాలు, గోలి అమరేందర్ రెడ్డి ప్యానెల్‌కు 7 స్థానాలు దక్కాయి. దీంతో రెండు ప్యానళ్ల మధ్య పోటీ ఆసక్తికరంగా సాగింది.

కీలక పదవులకు ఏకగ్రీవ ఎంపిక

నిర్వహణ కమిటీ సభ్యుల ఎన్నికల అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, ట్రెజరర్ తదితర కీలక పదవుల ఎంపికపై ఆసక్తి నెలకొంది. సోమవారం నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో నామినేషన్ల దాఖలుకు పది నిమిషాల గడువు కేటాయించారు. ఆయా పదవులకు ప్రత్యామ్నాయ నామినేషన్లు దాఖలు కాకపోవడంతో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.నూతన కార్యవర్గంలో చైర్‌పర్సన్‌గా డాక్టర్ హేమలత, వైస్ చైర్‌పర్సన్‌గా భీమనపల్లి శ్రీకాంత్, ట్రెజరర్‌గా కుంభం జ్యోతి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మంచుకొండ చిన్న బిక్షమయ్య ఎంపికయ్యారు.

సేవల విస్తరణపై ఆశలు

నూతన కార్యవర్గం ఏర్పాటుతో నల్గొండ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు మరింత విస్తరిస్తాయని సేవాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రక్తదాన శిబిరాల నిర్వహణ, రక్తనిధి సేవలు, పేదలకు వైద్య సహాయం, అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత కొత్త కమిటీపై ఉంది.సంస్థలో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ, సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలను విస్తరించి రెడ్‌క్రాస్ అభివృద్ధికి కృషి చేయాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. తొలి మహిళా చైర్‌పర్సన్‌గా డాక్టర్ హేమలత ఎన్నిక కావడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకతగా నిలిచింది.రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ ప్రేమ్ కుమార్, జిల్లా సహకార అధికారి మమత తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యుల ఎన్నికలతో పాటు కీలక పదవుల ఎంపికను నిబంధనల ప్రకారం పూర్తి చేసినట్లు వెల్లడించారు. నూతన కార్యవర్గం సంస్థ సేవలను మరింత విస్తరించి, అభివృద్ధికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.



ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

నల్గొండ, అక్టోబర్ 12 (విజయ కెరటం):



ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా, నాణ్యమైన రీతిలో పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారికి సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని సూచించారు. సోమవారం నల్గొండ కలెక్టరేట్‌లో



నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు ప్రజావాణికి వస్తుంటారని, వారి సమస్యలను పరిష్కరించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు.రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో తమ శాఖలకు అందిన దరఖాస్తులపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని సూచించారు. సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా కారణంతో దరఖాస్తును తిరస్కరించాల్సి వస్తే, అందుకు గల స్పష్టమైన కారణాలను దరఖాస్తుదారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించారు.ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై వారానికోసారి శాఖలవారీగా ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేస్తూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. తమ శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వివరాలను మంగళవారం లోపు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు.

ప్రజావాణికి 125 దరఖాస్తులు

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 125 దరఖాస్తులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 68, ఇతర శాఖలకు సంబంధించి 57 దరఖాస్తులు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావం.. ప్రతి నీటి బొట్టును పొదుపుగా వాడాలి

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్



నల్గొండ, అక్టోబర్ 12 (విజయ కెరటం):

ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. నీటి లభ్యత, భూమి స్వభావాన్ని బట్టి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటలను ఎంపిక చేసుకోవాలని, రానున్న 300 రోజులు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.సోమవారం పగిడిమర్రి గ్రామంలోని రైతు వేదికలో తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగార్జునసాగర్‌లో సాగునీటి లభ్యత పరిమితంగా ఉన్నందున చెరువులు, కాలువలు, బోరుబావుల్లో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైనంత నీటిని మాత్రమే ఉపయోగిస్తూ, జూన్, జూలై నెలల వరకు నీటి పొదుపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.రైతులు పెసర్లు, మినుములు, కందులు, పొద్దుతిరుగుడు, నువ్వులు వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పండ్లు, కూరగాయల సాగు వంటి ప్రత్యామ్నాయ పంటలపైనా దృష్టి సారించాలని అన్నారు. రైతులు పరస్పరం చర్చించుకుని ప్రత్యామ్నాయ పంటలపై తమ అభిప్రాయాలను తెలియజేస్తే, వాటిని ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.నీటి ఎద్దడిని అధిగమించేందుకు అధికారులు, రైతులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పనులను వినియోగించుకుని కూలీలు జీవనోపాధి పొందవచ్చని తెలిపారు. రైతులకు అవసరమైన స్ప్రింక్లర్లు, ఇతర వ్యవసాయ పరికరాల వివరాలు అందిస్తే ప్రభుత్వ సహకారంతో వాటిని సమకూర్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఐదు రైతు క్లస్టర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా ఉద్యానవన అధికారి శేఖర్, ట్రాన్స్‌కో ఎస్ఈ, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, సర్పంచ్ నాగవెల్లి నాగమణి సైదులు, ఏఈవో కీర్తన, జగల్ రెడ్డి, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

లంగాణలో మండు ఎండలు..
18 జిల్లాలకు ఎల్లో అలర్ట్!

నల్గొండ, అక్టోబర్ 12 (విజయ కెరటం):

తెలంగాణలో వాతావరణం వేసవిని తలపిస్తోంది. పగటిపూట ఎండ తీవ్రత పెరుగుతుండగా, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గాలిలో తేమ శాతం తగ్గిపోవడంతో వేడి ప్రభావం మరింత అధికమవుతోంది. ఖమ్మం, మహబూబ్‌నగర్ సహా పలు ప్రాంతాల్లో సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

తగ్గుతున్న గాలిలో తేమ శాతం

హైదరాబాద్‌లో గాలిలో తేమ శాతం 49కు పడిపోగా, రామగుండంలో 42, హనుమకొండలో 49, మహబూబ్‌నగర్‌లో 51, నిజామాబాద్, నల్గొండలో 45 శాతంగా నమోదైంది. సాధారణంగా 60 నుంచి 70 శాతం మధ్య ఉండాల్సిన తేమ కొన్ని ప్రాంతాల్లో 50 శాతం కంటే తక్కువగా ఉండటంతో ఉక్కపోత, వేడి తీవ్రత పెరుగుతున్నాయి.

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

రానున్న మూడు రోజుల్లో పెద్దపల్లి, ఖమ్మం, మంచిర్యాల, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, కుమురం భీం ఆసిఫాబాద్, ములుగు, నారాయణపేట, జోగులాంబ గద్వాల, జగిత్యాల, వనపర్తి, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు పేర్కొంది. మరోవైపు నైరుతి రుతుపవనాలు ఒకట్రెండు రోజుల్లో తెలంగాణ నుంచి పూర్తిగా నిష్క్రమించే అవకాశం ఉండటంతో వాతావరణ పరిస్థితులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా తగినంత నీరు తాగుతూ, అవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

గ్రీవెన్స్ డేలో 38 మంది బాధితుల ఫిర్యాదుల స్వీకరణ

- బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి: ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్లగొండ, అక్టోబర్ 12 (విజయ కెరటం):

నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ 38 మంది బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, సమస్యల స్వభావాన్ని బట్టి చట్టపరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, ప్రతి దరఖాస్తుపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత సమయంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే పోలీస్ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు.గ్రీవెన్స్ డేలో అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు.

నల్లగొండ రెడ్‌క్రాస్ సొసైటీకి తొలి మహిళా చైర్మన్‌గా డాక్టర్ హేమలత!

వైస్ చైర్మన్‌గా భీమనపల్లి శ్రీకాంత్.. ట్రెజరర్‌గా కుంభం జ్యోతి రెడ్డి ఏకగ్రీవ ఎంపిక



నల్లగొండ, (విజయ కెరటం):

నల్లగొండ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కమిటీ కొలువుదీరింది. సొసైటీ చరిత్రలో తొలిసారిగా మహిళా చైర్మన్‌గా డాక్టర్ హేమలత ఎంపికయ్యారు. వైస్ చైర్మన్‌గా భీమనపల్లి శ్రీకాంత్, ట్రెజరర్‌గా కుంభం జ్యోతి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మంచుకొండ చిన్న బిక్షమయ్య ఎంపికయ్యారు.కీలక పదవులకు నామినేషన్లు దాఖలు చేసేందుకు కేటాయించిన పది నిమిషాల గడువులో వీరికి పోటీగా ఎవరూ నామినేషన్లు వేయకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సమాచారం.రెడ్‌క్రాస్ సొసైటీకి తొలిసారిగా మహిళా చైర్మన్ ఎంపిక కావడంతో సభ్యుల్లో హర్షం వ్యక్తమవుతోంది. నూతన కమిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తరించడంతో పాటు సొసైటీ అభివృద్ధికి మరింత కృషి జరుగుతుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎంజీఎం ఆసుపత్రి మార్పుపై పునఃపరిశీలించాలి

పేద రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

వరంగల్ విజయ కెరటం 12 అక్టోబర్ :



ఎంజీఎం ఆసుపత్రి ఓపీ విభాగాన్ని నూతన సూపర్ స్పెషాలిటీ భవనానికి మార్చే అంశంపై పునఃపరిశీలన చేయాలని ప్రజాసంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఎంజీఎం ఆసుపత్రి ఓపీ విభాగాన్ని కొత్తగా నిర్మించిన 25 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ భవనానికి మార్చే నేపథ్యంలో పేద, సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కొన్ని వైద్య సేవల కోసం కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ)కి వెళ్లాల్సి వస్తుండటంతో రోగులు ప్రయాణ ఖర్చులు, సమయ నష్టంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఓపీ విభాగం ఒకచోట, ఇతర ప్రధాన వైద్య సేవలు మరోచోట ఉంటే రోగులు మరింత ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు.నూతన భవనంలో అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత ఓపీ, ఐపీ, అత్యవసర వైద్య సేవలు, శస్త్రచికిత్స విభాగాలను సమగ్రంగా ఒకేసారి మార్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. అప్పటివరకు రోగులకు ఇబ్బందులు కలగకుండా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి, అవసరమైన రవాణా సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పేద ప్రజలకు సులభంగా, సకాలంలో ప్రభుత్వ వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో ఆర్‌టీఐ కార్యకర్త ఐతం నగేష్, అఖిల భారత మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్, ధర్మ సమాజ్ పార్టీ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు దామెర బాబు, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పాల కుమార్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కోల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తిప్పర్తి విద్యార్థిని ప్రణీత ఎంపిక

నల్గొండ జిల్లా తరపున ప్రాతినిధ్యం

తిప్పర్తి, అక్టోబర్ 12 (విజయ కెరటం):



తిప్పర్తి మండల కేంద్రంలోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని పి. ప్రణీత రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-19 బాలికల కబడ్డీ విభాగంలో ప్రణీత తన ప్రతిభతో రాష్ట్ర స్థాయికి అర్హత సాధించినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నిమ్మల లెనిన్ బాబు తెలిపారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రణీత నల్గొండ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనుంది. క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ప్రణీతను మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ నాయక్, సీనియర్ ఉపాధ్యాయులు నర్ర దామోదర్ రెడ్డి, గంజి జ్యోతి, హమీమా, పద్మలత, భైరం శ్రీనివాస్, జ్యోతిర్మయి, ఇతర ఉపాధ్యాయులు, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రణీత ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, నల్గొండ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ పాశం రామ్‌రెడ్డి ఆశీస్సులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ప్రణీతకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా జర్నలిజం ఉండాలి: మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి





నాగార్జునసాగర్‌లో జర్నలిస్టులకు ఏఐ, సోషల్ మీడియాపై శిక్షణ

నల్గొండ, అక్టోబర్ 12 (విజయ కెరటం):

జర్నలిజం ప్రజల పక్షాన నిలుస్తూ, వారి మనోభావాలు, ప్రయోజనాలను ప్రతిబింబించేలా ఉండాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజా ప్రయోజనాలను పరిరక్షించడం, ప్రజలకు సమాచారాన్ని అందించి చైతన్యపరచడం మీడియా ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నాగార్జునసాగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నల్గొండ జిల్లాలోని జర్నలిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సోషల్ మీడియాపై నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల మనోభావాలను ప్రతిబింబించలేకపోతే మీడియాపై ప్రజలకు నమ్మకం తగ్గుతుందని అన్నారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల తర్వాత ప్రజాస్వామ్యంలో జర్నలిజానికి కీలక స్థానం ఉందని, ఆ గౌరవాన్ని జర్నలిస్టులు నిలబెట్టుకోవాలని సూచించారు. జర్నలిస్టులు సమాజ సేవకు అంకితమై పనిచేయాలని పిలుపునిచ్చారు.వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలు, జర్నలిస్టుల హక్కులు, పత్రికా యాజమాన్యాలతో సంబంధాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్, డిజిటల్ మీడియా మధ్య వృత్యాసాలు, జర్నలిజానికి సంబంధించిన చట్టాలు, మార్గదర్శక సూత్రాలపై ఆయన వివరించారు.ఏఐ అంశంపై ఫ్యాక్ట్ చెకర్, ఏఐ ట్రైనర్ సత్యప్రియ శిక్షణ ఇవ్వగా, సోషల్ మీడియాపై ముద్దం నరసింహస్వామి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, నల్గొండ జిల్లా సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, , మీడియా అకాడమీ చైర్మన్ ఓఎస్డీ రహమాన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, మీడియా అకాడమీ పీఆర్ఓ శైలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాగార్జునసాగర్, నందికొండ, దేవరకొండ, మిర్యాలగూడ తదితర ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని శాలువాలు, పూల బొకేలతో సన్మానించారు.

ఆసియా మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో నల్లగొండ ఏఆర్ కానిస్టేబుల్ ప్రతిభ

భారత్ తరపున 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో పాల్గొన్న పురుషోత్తం రావు.. ఎస్పీ అభినందనలు

నల్లగొండ, అక్టోబర్ 12 (విజయ కెరటం):

ఆసియా మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్--2026 అంతర్జాతీయ పోటీల్లో భారతదేశం తరపున పాల్గొని నల్లగొండ జిల్లా పోలీస్ శాఖకు గుర్తింపు తీసుకొచ్చిన ఏఆర్ కానిస్టేబుల్ బి. పురుషోత్తం రావును జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ అభినందించారు.బెంగళూరులో అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన ఆసియా మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో పురుషోత్తం రావు 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో పాల్గొని తన క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూనే అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనడం విశేషం.ఈ సందర్భంగా సోమవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో పురుషోత్తం రావు జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయనను అభినందిస్తూ, విధి నిర్వహణతో పాటు క్రీడలపై ఆసక్తిని కొనసాగించడం ప్రశంసనీయమని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.పోలీస్ సిబ్బంది తమలోని ప్రతిభను గుర్తించి వివిధ క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. పురుషోత్తం రావు భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయన క్రీడా ప్రయాణం ఇతర పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిగా నిలవాలని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ సంతోష్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



భారత్ జపాన్ స్నేహ సంబంధాలు మరింత బలోపేతం కావాలి

తెలంగాణ హిరోషిమా మధ్య పారిశ్రామిక, సాంకేతిక, విద్యా రంగాల్లో సహకారం పెరగాలి

హైదరాబాద్, అక్టోబర్ 12 (విజయ కెరటం):

భారత్--జపాన్ దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థల అభివృద్ధికి పరస్పర సహకారం అవసరమని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ--జపాన్‌లోని హిరోషిమా ప్రాంతాల మధ్య పారిశ్రామిక, సాంకేతిక, విద్యా, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆకాంక్షించారు.సోమవారం తెలంగాణ శాసనసభను జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చురల్ అసెంబ్లీ, ప్రభుత్వ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా తెలంగాణ శాసనసభలో ప్రత్యేక సమావేశం నిర్వహించి, జపాన్ ప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు.

జపాన్ పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు

భారత్, జపాన్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక అభివృద్ధి, పరిశోధనలు, ఆవిష్కరణల్లో జపాన్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఐటీ, ఫార్మా, వ్యవసాయం, విద్య, వైద్య రంగాలతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో తెలంగాణ వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు.తెలంగాణలో జపాన్ పెట్టుబడులు పెరిగితే యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ఇరు ప్రాంతాలు సహకరించాలని ఆకాంక్షించారు. రెండో ప్రపంచ యుద్ధంలో తీవ్ర విధ్వంసాన్ని ఎదుర్కొన్న హిరోషిమా నగరం శాంతి, పునర్నిర్మాణం, అభివృద్ధికి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.

ఆధునిక సాంకేతికతలో పరస్పర సహకారం

తెలంగాణ, హిరోషిమా మధ్య ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాల్లో సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. జపాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణలోని మానవ వనరులతో సమన్వయం చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.శాసనసభల మధ్య పరస్పర అనుభవాల మార్పిడి ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తుందని తెలిపారు. శాసన ప్రక్రియలు, సభల నిర్వహణ, కమిటీల పనితీరు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ఇరు ప్రాంతాల ప్రతినిధులు అనుభవాలను పంచుకోవాలని సూచించారు. విద్యార్థులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణుల పరస్పర మార్పిడి కార్యక్రమాలను విస్తరించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్--జపాన్‌లోని మియోషి నగరాల మధ్య కొనసాగుతున్న సోదర నగర సంబంధాలు ఇరు ప్రాంతాల సాంస్కృతిక, సామాజిక అనుబంధాలకు నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. ఈ పర్యటన తెలంగాణ--జపాన్ ప్రాంతాల మధ్య భవిష్యత్తు సహకారానికి బలమైన వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన మండలి కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి, జపాన్ ప్రతినిధుల బృందం సభ్యులు, శాసనసభ, శాసన మండలి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528